# ఆధునిక నీతి కథలు

తొళ్ళూరు నాగేశ్వరరావు

శివప్రసాద్, కృష్ణప్రసాద్- ఇద్దరూ ఒక వూరివాళ్ళే; ఒక వీధి వాళ్ళే. అయితే శివప్రసాద్ తండ్రి భూస్వామి. కృష్ణప్రసాద్ తండ్రి రిటైర్డ్ స్కూల్సు ఇనస్పెక్టరు. శివప్రసాదూ, కృష్ణప్రసాదూ స్కూలుఫైనల్ దాకా ఒకే స్కూల్లో చదువుకున్నారు. ఇంటర్మీడియెట్ దాకా ఒకే కాలేజీలో చదువుకున్నారు. ఇద్దరూ ఒకే రూమ్‌లో వుండేవారు. ఇద్దరూ ఎం.పి.సి. గ్రూపులో ఇంటర్మీడియెట్ మంచి మార్కులతో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్ష వ్రాశారు. అందులో ఇద్దరూ మంచి ర్యాంకులు తెచ్చుకున్నారు. ఇద్దరికీ వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ బ్రాంచిలో సీట్లు వచ్చాయి. ఇద్దరూ చేరారు. హాస్టల్లో కూడా ఇద్దరికీ ఒకే రూమ్ లభించడం చెప్పుకోదగ్గ విశేషమే.

ఆ ఇరువురి తెలివితేటల్నీ, చదువులో సామర్ధ్యాన్నీ, సత్ప్రవర్తననూ ఊళ్లోవాళ్లందరూ ఆదర్శంగా, అభిమానంగా, అపూర్వంగా చెప్పుకోవడంలో వింత ఏమీ లేదు. అన్ని సంత్సరాలుగా ఇద్దరూ స్నేహంగా, పరస్పర ఆదరాభిమానాలతో, సర్దుబాటు మనస్తత్వంతో ఉండడం కొంతమందికి ఆశ్చర్యం కలిగించినా అదో గొప్పగా అందరూ చెప్పుకొనేవాళ్లు మరి.

అట్లాంటిది వాళ్లు ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతూండగా ఒకరోజు సాయంత్రం, ఊళ్లో అంకయ్యగారి వెంకయ్య వడ్లకొట్ల వసారాలో పదిమంది కూడి లోకాభిరామాయణం మాట్లాడుతూండగా, "మొన్న నేను వరంగల్ వెళ్లొచ్చాను." అన్నాడు వెంకటసుబ్బయ్య తమ్ముడు వెంకటప్పయ్య.

"వెళితే" అన్నాడు సూరయ్య ఆరిపోయిన చుట్టను మురుక్కాలవలోకి విసిరేస్తూ.

"మన స్కూల్లో ఇనస్పెక్టరు కొడుకు కృష్ణప్రసాద్ లేడూ...."

"ఆఁ.... ఆఁ" అన్నాయి రెండు గొంతులు అతి ఆత్రంగా.

"వాడు చాలా తెలివిగలవాడూ, చదువులో పైకి వస్తున్నాడూ అని యింత కాలంగా చెప్పుకుంటున్నాం కదా!"

"మరి" అన్నాయి మరో రెండు కంఠాలు ఉత్కంఠతతో.

"ఈ మధ్య ఆ బుద్ధిమంతుడు చదువుకు 'తూనాఁబొడ్డు' పెట్టి నక్సలైట్లలో కల్సిపోయాడంట! కాలేజీ లేదూ! కుమ్మరాఁ లేదూ!" అన్నాడు, వెంకటప్పయ్య.

"ఈ సంగతి వాళ్ల నాన్నకు తెల్సా?" అన్నాడు సూరయ్య.

"తెలిస్తేం, తెలియకపోతేం? ఈడొచ్చిన కొడుకు బురదలోకి దిగితే, ఆ ముసలాడు ఏం చేయగలడు?" అన్నాడు వెంకటప్పయ్య మాండలికంగా దీర్ఘం తీస్తూ.

రిటైర్డ్ స్కూళ్ల ఇనస్పెక్టరు కొడుకు కృష్ణప్రసాద్ వరంగల్‌లో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతూ నక్సలైట్లలో కల్సిపోయాడనే వార్త అనోటా ఆనోటా వూరంతా పాకిపోయింది. అందరూ ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. కృష్ణప్రసాద్ తండ్రికి కూడా తెల్సింది. రిటైర్ అయ్యాక పూర్తిగా ఆధ్యాత్మిక ధ్యాసలోపడ్డ ఆయన దాన్ని గురించి సీరియస్‌గా తీసుకోలేదు.

పదిహేడు రోజుల తర్వాత కృష్ణప్రసాద్‌కు ఒక సంబంధం వొచ్చింది– రెండున్నర లక్షల కట్నం ఇచ్చే ఉద్దేశంతో పిల్లతరుపువాళ్లు ఊళ్లో నలుగురు పెద్దమనుషుల్ని వాకబు చేయగా, కృష్ణప్రసాద్ నక్సలైట్లలో కల్సాడనీ, అంత కట్నంతో బంగారంలాంటి పిల్లను అతగాడికిచ్చి పిల్ల భవిష్యత్తులో ఎర్రటి నిప్పులు పోయడం అన్యాయమని ఆ పెద్దమనుష్యులు ఉచిత సలహా యిచ్చారు

"కృష్ణప్రసాద్ నక్సలైట్లలో కల్సినట్టు ఏమైనా దాఖలాలున్నాయా?" అన్నాడు పిల్ల అన్నయ్య ఏ మాత్రం అధైర్యపడకుండా.

"దరఖాస్తులూ, దాఖలాలు విషయం మాకేం తెల్సు? నలుగురూ అనుకొనే మాట!" అన్నాడొక పెద్దమనిషి.

"అది పుకారో, పచ్చి నిజమో మాకు తెలీదు" అన్నాడు మరో పెద్దమనిషి పెద్దమనిషి తరహాగా.

పిల్ల అన్నయ్య సుబ్రహ్మణ్యం గుంటూరులో ఒక పెద్దలాయరు వద్ద అప్రెంటీస్ చేస్తున్నాడు– ఎల్.ఎల్.బి తర్వాత అతనిది పరిశోధన మనస్సు. ఏ విషయం తీసుకున్నా కూలంకషంగా పరిశోధన జరపనిదే విడిచిపెట్టడు. కృష్ణప్రసాద్ అసలు నక్సలైట్ అవునో, కాదో ఆచూకీ తీయడానికి సుబ్రహ్మణ్యం ఎంతో శ్రమపడ్డాడు.

ఊళ్లో చాలామందిని అడిగాడు. ఎవరో ఎవరో చెప్పిన మాటగా కనబడింది గానీ, అసలు వాస్తవం ఏమిటో తెలియలేదు.

సుబ్రహ్మణ్యం పనిగట్టుకొని వరంగల్ వెళ్లాడు– రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో–కొంతమంది లెక్చరర్లను, ప్రొఫెసర్లను, విద్యార్థుల్ని ఆచూకీ తీశాడు.

కృష్ణప్రసాద్ రోజూ కాలేజీకి రెగ్యులర్‌గానే వెళుతున్నాడు. మంచి స్టూడెంట్ అనే అభిప్రాయం అతని క్లాసుకెళ్లే లెక్చరర్లకూ, ప్రొఫెసర్లకూ వుంది. చివరకు కృష్ణప్రసాద్ రూమ్‌మేట్ శివప్రసాద్‌ను కల్సుకున్నాడు సుబ్రమణ్యం. అప్పుడు కృష్ణప్రసాద్ రూమ్‌లో లేడు.

"మీ రూమ్‌మేట్ గురించి మీ అభిప్రాయమేమిటి?" అన్నాడు. సుబ్రమణ్యం, తనని పరిచయం చేసుకొని, తనొచ్చిన పని చెప్పినమీదట

"మంచివాడు, బుద్ధిమంతుడు, చదువులో చురుకైన వాడు...." అన్నాడు శివప్రసాద్.

"మరి మీ వూర్లో అతను నక్సలైట్లలో కల్సాడని పుకారు బలంగా అమల్లో వుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

దానికి సమాధానంగా శివప్రసాద్ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు ఆ చిరునవ్వు అంతరార్థమేమిటో సుబ్రహ్మణ్యానికి బోధపడలేదు. కాని శివప్రసాద్‌కు తెలుసు! తనే ఒకసారి తన వూరివాడితో కృష్ణప్రసాద్ ఒకనక్సలైట్‌తో స్నేహం చేస్తున్నాడని సూచాయగా అన్నాడు. అది పుకారై, అక్కడక్కూడా వ్యాపించి, నిజానిజాలకోసం చివరకు తన దగ్గరికే చేరింది!

*పుకార్లు ఎక్కడ పుడతాయో మళ్లీ అక్కడకే చేరతాయి.*


## తెల్లమచ్చలు

మా మందు ఉపయోగించటంవల్ల తెల్లమచ్చలు సహజమైన రంగులోకి మూడు రోజుల్లో మారుతుంది. ఆర్డరు పంపిన వెంటనే ఒక సీసామందు ఉచితంగా ఇవ్వబడుతుంది. వ్యాధి పూర్తిగా నివారించబడుతుంది. మీ అడ్రస్ యింగ్లీషులోనే వ్రాయండి.

GAZETTED TREATMENT CENTRE (Y.V.)
P. O. KATRISARAI (GAYA)

## తెల్లవెంట్రుకలు నలుపు

తెల్లవెంట్రుకలు మా అయుర్వేద రిజర్వ్ అయిల్‌తో కుదుళ్లనుండి నల్లబడతాయి. మనోవికాసము మరియు కళ్లు ప్రకాశవంతంగా ఉండేందుకు కూడా తోడ్పడుతుంది. ఫుల్ కోర్స్ రు॥ 45 పోస్టేజి అదనం. మీ అడ్రస్ యింగ్లీషులోనే వ్రాయండి.

RESERVE OIL COMPANY (Y.V.)
P. O. KATRISARAI (GAYA)